క్లుప్తంగా

నిరుపేద బాలిక వైద్యానికి ఆర్థిక సాయం

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపూడికి చెందిన బాలిక కాంపాటి జ్యోష్ణవి ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. నిరుపేద కుటుంబానికి చెందిన ఆమె వైద్య ఖర్చులకు ఇబ్బంది ఎదురవుతోందని తెలియడంతో మంచుకొండ కృప యువజన సంఘం వ్యవస్థాపకులు మంద సంజీవరావు శనివారం రూ.5వేలు అందించారు. ఈ కార్యక్రమంలో జావీద్, కంచర్ల మోహన్, శివ, మారపాక పృథ్వీ, వడకాల ప్రవీణ్, రాజేష్, తోటపల్లి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ల శాంతియుత ర్యాలీ

ఖమ్మంరూరల్: మణిపూర్‌లో జరుగుతున్న హింసాత్మక ఘటనలకు నిరసనగా శనివారం మండలంలోని వరంగల్‌క్రాస్‌రోడ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు మండల పాస్టర్ల ఆధ్వర్యాన శాంతియుత ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఫెలోషిప్ అధ్యక్షుడు జిల్లేపల్లి ఫిలిఫ్ మాట్లాడుతూ.. మహిళలపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీహెచ్.రమేష్, సంతోష్, పీటర్, శ్యాంబాబు సాల్మన్, బాసు తదితరులు పాల్గొన్నారు.

4న కార్మిక గర్జన

ఖమ్మంఅర్బన్: తెలంగాణ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం(ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యాన కార్మిక హక్కుల సాధన కోసం వచ్చేనెల 4న హైదరాబాద్‌లో కార్మిక గర్జన సభ నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు పేరబోయిన వెంకన్న తెలిపారు. ఈమేరకు ఆయన ఖమ్మం ఏరియా కార్యదర్శి కొయ్యల శ్రీనివాస్ తదితరులు కలిసి కార్మిక అడ్డాల్లో పర్యటించి సభకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

నాసిరకంగా 'డబుల్' ఇళ్లు

కూసుమంచి: డబుల్ బెడ్‌రూం ఇళ్లను నాసిరకంగా నిర్మించడం వల్లే వర్షం నీరు ఇళ్లల్లోకి వస్తోందని,వెంటనే బాధితులకు శాశ్వత పరిష్కారం చేపట్టాలని బీఎస్పీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ అల్లిక వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం కూసుమంచిలోని ఇళ్లను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ డబుల్ ఇళ్లు కేవలం ప్రభుత్వ ప్రచార ఆర్భాటం కోసమే తప్ప ప్రజా శ్రేయస్సు కోసం కాదని విమర్శించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డీఎంఏ సక్సెస్ మీట్



విద్యార్థినిని అభినందిస్తున్న డైరెక్టర్లు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని డాక్టర్స్ మెడికల్ అకాడమీ(డీఎంఏ) సక్సెస్ మీట్ భక్త రామదాసు కళాక్షేత్రంలో శనివారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ, ఆర్‌జేసీ, ఎస్‌బీఐటీ విద్యాసంస్థల చైర్మన్ గుండాల కృష్ణ, టీపీజేఎంఏ గౌరవ అధ్యక్షుడు వీరారెడ్డి, అధ్యక్షుడు చల్లా శేషగిరిరావుతో పాటు నర్సింహారావు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. తక్కువ సమయంలో వంద మందికి పైగా విద్యార్థులు మెడికల్ సీట్లు సాధించేలా శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. అనంతరం అకాడమీ డైరెక్టర్లు రాయల సతీష్‌బాబు, ఈగా భరణికుమార్ మాట్లాడాక సీట్లు విద్యార్థులను సన్మానించారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీ నామా పరామర్శ

ఖమ్మం అర్బన్: నగరంలోని పలు కుటుంబాలను ఎంపీ నామా నాగేశ్వరరావు పరామర్శించారు. శనివారం వీడీయోస్ కాలనీకి చెందిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్ కుమారుడు శ్రీధర్ ఇటీవల ఆకస్మికంగా మృతి చెందగా రాధాకిషోర్ కుటుంబసభ్యులను పరామర్శించారు. గాంధీచౌక్‌కు చెందిన మెల్లచెర్వు వెంకటేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందగా.. వారిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌తో పాటు నల్లమల వెంకటేశ్వరరావు, చిత్తారు సింహాద్రియాదవ్, వాకదాని కోటేశ్వరరావు, జి. మాధవరావు, పాల్వంచ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు జర్నలిస్టుల పోస్టుకార్డు ఉద్యమం

ఖమ్మం సహకారనగర్: వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇళ్లస్థలాలు ఇవ్వడంతో పాటు ప్రభుత్వం జారీ చేసిన హెల్త్‌కార్డులు అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో చెల్లుబాటయ్యేలా చూడాలని కోరుతూ సోమవారం పోస్టుకార్డు ఉద్యమం చేపడుతున్నట్లు టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరరావు తెలిపారు. ఖమ్మం బొమ్మనసెంటర్‌లోని హెడ్ పోస్టాఫీస్ ఎదుట ఉదయం 10గంటలకు జరిగే కార్యక్రమానికి జర్నలిస్టులు హాజరుకావాలని వారు ఓ ప్రకటనలో కోరారు.

యథాస్థితికి చేర్చేలా..

పారిశుద్ధ్యంపై కేఎంసీ ప్రత్యేక దృష్టి

- వరద ముంపు ప్రాంతాల్లో వ్యర్థాలు తొలగిస్తున్న మున్సిపల్ కార్మికులు
- బ్లీచింగ్, క్లోరినేషన్ చేయిస్తున్న యంత్రాంగం
- 15 ట్రాక్టర్లు, రెండు జేసీబీలు, 130 మంది కార్మికులతో పనులు



బొక్కలగడ్డ ప్రాంతంలో వ్యర్థాలను తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు


బ్లీచింగ్ చల్లుతున్న కార్మికుడు

ఖమ్మంమయూరిసెంటర్: మున్నేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేశారు. శనివారం ప్రత్యేక ట్రాక్టర్లు, కార్మికులను ఏర్పాటు చేసి వరద ప్రవహించిన ప్రాంతాల్లో చేరిన వ్యర్థాలను తొలగించే పనులు చేపట్టారు. వెంకటేశ్వరనగర్, పద్మావతినగర్, బొక్కలగడ్డ, మోతినగర్, రామన్నపేట కాలనీ, ధంసలాపురం కొత్త కాలనీల్లో స్థానిక కార్మికులు, ట్రాక్టర్లకు అదనంగా కొంతమంది కార్మికులు, ట్రాక్టర్లను ఏర్పాటు చేసి రోడ్లపైకి చేరిన వ్యర్థాలను తొలగిస్తున్నారు. మేయర్ పునుకొల్లు నీరజ, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, డిప్యూటీ కమిషనర్ మల్లీశ్వరి క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కార్మికులను సమన్వయం చేసుకుంటూ పారిశుద్ధ్య పనులను చేయిస్తున్నారు. వరద ప్రవాహానికి కొట్టుకొచ్చిన చెట్లు, కర్రలు, సామన్లు, రోడ్లపై పేరుకుపోయిన వ్యర్థాలతో పాటు ఇళ్లల్లో పాడైపోయిన సామన్లను సైతం కార్మికులు తొలగిస్తున్నారు.

బ్లీచింగ్, క్లోరినేషన్..

ముంపు ప్రాంతాల్లో పేరుకుపోయిన వ్యర్థాలు, బురదను తొలగించిన వెంటనే అధికారులు బ్లీచింగ్ చల్లించారు. నిల్వ నీటి ప్రాంతాలు, బావులు, బోర్లల్లో క్లోరినేషన్ చేయించారు. ఇలా ఐదు రోజుల పాటు చేయనున్నారు. కాగా, రెండ్రోజుల్లో వ్యర్థాలన్నింటిని శుభ్రం చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు. అలాగే మంచినీటి సరఫరాలేని ప్రాంతాలకు 9 ట్యాంకర్ల ద్వారా మంచినీటిని పంపిణీ చేస్తున్నారు. ఇక వరద ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణకు ఆ శాఖ అధికారులు నీటిలో తడిచిన మీటర్ల స్థానాల్లో కొత్త మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు.

15 ట్రాక్టర్లు,130 మంది కార్మికులు..

మున్నేరు వరదతో నగరంలోని 60, 48, 47, 35, 46, 16వ డివిజన్‌లలోని లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు చేరింది. ఆయా ప్రాంతాల్లో పేరుకుపోయిన వ్యర్థాలతో పాటు మట్టి, ఇసుక, కర్రలు, చెట్లను తొలగింపు పనులను వేగవంతం చేశారు. బొక్కలగడ్డ, పద్మావతినగర్, వెంకటేశ్వరనగర్, మోతినగర్ ప్రాంతాల్లో వ్యర్థాలు, బురద ఎక్కువగా చేరడంతో ఆయా ప్రాంతాల్లో అదనంగా కార్మికులు, ట్రాక్టర్లను ఏర్పాటు చేసి పనులు చేపట్టారు. మున్సిపాలిటీకి చెందిన ఐదు ట్రాక్టర్లకు అదనంగా మరో 10 ట్రాక్టర్లను కిరాయికి తెప్పించి వ్యర్థాలను బయటకు తరలించే పనులు చేపట్టారు. వ్యర్థాలను ట్రాక్టర్లలోకి ఎత్తేందుకు కేఎంసీ జేసీబీలు రెండింటిని వినియోగించారు. ఇక కేఎంసీ కార్మికులు 80 మందితో పాటు మరో 50 మంది రోజువారీ కూలీ కింద ఏర్పాటు చేసి పారిశుద్ధ్య పనులను నిర్వహించారు.

నిరంతరం పర్యవేక్షిస్తున్నాం..



వరద ప్రభావిత ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను వేగవంతం చేశాం. మున్సిపల్ కార్మికులతో పాటు అదనంగా రోజువారీ కూలీలను ఏర్పాటు చేసుకొని వ్యర్థాల తొలగిస్తున్నాం. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూస్తున్నాం. లోతట్టు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం.

– పునుకొల్లు నీరజ, మేయర్, కేఎంసీ

పారిశుద్ధ్యం మెరుగు పడేదాక..



మున్నేరు వరదకు పలు ప్రాంతాల్లో వ్యర్థాలతో పాటు బురద చేరింది. దీంతో వాటి తొలగింపు పనులను ముమ్మరం చేశాం. ముంపు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మెరుగు పడే వరకు పనులు కొనసాగుతాయి. మరో ఐదు రోజుల పాటు నిరంతరం వరద ప్రభావిత ప్రాంతాల్లో బ్లీచింగ్, క్లోరినేషన్ చేయించేలా సిబ్బందిని ఆదేశించాం.

– బి.మల్లీశ్వరి, డిప్యూటీ కమిషనర్, కేఎంసీ

వరద బాధితులను ఆదుకోవాలి

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంమామిళ్లగూడెం/కూసుమంచి: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతాంగాన్ని, వరద బాధితులను ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందుల రాజేంద్రప్రసాద్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మహ్మద్ సలామ్, అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఖమ్మంలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో రాంజేద్రప్రసాద్, ఎఫ్‌సీఐ గోదాం లారీ కార్యాలయం వద్ద సలామ్, కూసుమంచిలో వెంకట్రామిరెడ్డి మాట్లాడారు. ఇళ్లు దెబ్బతిన వారికి డబుల్‌బెడ్రూం, వరద బాధిత ప్రతీ కుటుంబానికి రూ.25వేలు ఆర్థిక సాయం, వర్షాలతో మృతిచెందిన వారికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. ఆయా సమావేశాల్లో పార్టీ నాయకులు వై.ప్రకాశ్, ఎస్‌కె.కాసీం, ఐ.వెంకన్న, జానకి, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే.సైదా, నిజాంపేట యాఖుబ్, ఎండీ.రెహమాన్, జ్వాలా నరసింహారావు, పాండు, మునీరా, డాక్టర్ ఖాసీం పాషా, సీహెచ్. వీరయ్య, బి. సైదులు, నాగయ్య, వీరస్వామి, తోట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మహ్మద్ సలామ్

జిల్లాలో వేద పాఠశాల ఏర్పాటుకు కృషి


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న పొంగులేటి

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలో వేద పాఠశాల ఏర్పాటుకు కృషి చేస్తానని తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని పలు డివిజన్లలో శనివారం ఆయన పర్యటించారు. శ్రీనివాసనగర్‌లోని సత్యసాయి ఆశ్రమంలో జరిగిన బ్రాహ్మణుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీ అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే జిల్లాలో వేద పాఠశాల, బ్రాహ్మణ కులస్తుల కోసం ప్రత్యేక కమ్యూనిటీ హాల్‌తో పాటు వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే సరితాక్లినిక్ సెంటర్‌లో తలసేమియా వ్యాధితో బాధపడుతూ మృతిచెందిన కిరణ్ జయంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి కిరణ్ తల్లిదండ్రులు, రక్తదాతలను అభినందించారు. పలు ప్రైవేటు కార్యక్రమాల్లోనూ పొంగులేటి పాల్గొన్నారు. ఆయన వెంట డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయబాబు, కార్పొరేటర్లు దొడ్డా నగేష్ యాదవ్, మలీదు జగన్, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, కొప్పెర ఉపేందర్‌లతో పాటు బాణాల లక్ష్మణ్, దుంపల రవికుమార్, ఇమామ్ భాయ్, మియాభాయ్, కొంగర జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

పొంగులేటి పరామర్శ..

కూసుమంచి: మండలంలోని పోచారం, కిష్టాపురం గ్రామాల్లో శనివారం పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించారు. పోచారం గ్రామానికి చెందిన పార్టీ నాయకుడు ఇందుర్తి వెంకటరెడ్డి తండ్రి ఇటీవల మృతిచెందగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. అలాగే చైటపల్లి గ్రామంలోనూ పలు కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు.ఈ సందర్భంగా ప్రచార కమిటీ కన్వీనర్‌గా బాధ్యతలు చేపట్టిన పొంగులేటిని మండల కాంగ్రెస్ నాయకులు సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం..

త్యాగానికి ప్రతీకగా నిర్వహించే మొహర్రంను శనివారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజులపాటు పీర్లను పురవీధుల్లో ఊరేగించి త్యాగమూర్తులను స్మరించుకుకొని చివరిరోజు పీర్లను నిమజ్జనం చేశారు. పీర్ల వెంట ముస్లింలతో పాటు హిందువులు, ఇతరులు కూడా వెళ్లి మతసామరస్యానికి ప్రతీకగా నిలిచారు. అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

–సాక్షినెట్‌వర్క్


తిరుమలాయపాలెం: తెట్టెలపాడులో పీర్లను ఊరేగిస్తున్న ముస్లింలు


ఖమ్మంఅర్బన్: 7వ డివిజన్ టేకులపల్లి కేసీఆర్ టవర్స్‌లో అన్నదానం

నిబంధనలు పాటించాలి

నేలకొండపల్లి: వాహనదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని నేలకొండపల్లి ఎస్సై బి.సతీష్ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలో వాహన తనిఖీలు నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతీ వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, కెపాసిటీకి మించి ప్రయాణికులను ఎక్కిస్తే సహించేది లేదని, దుకాణాలు రోడ్డెక్కితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్సై కోడేశ్రాము, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెరువుమాధారం వసతి గృహం అధికారిగా ఓదెలు

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం ఎస్సీ బాలుర వసతి గృహం అధికారిగా రాచూరి ఓదెలును నియమించారు. గతంలో ఇదే వసతి గృహం అధికారిగా పని చేసిన ఓదెలు జోనల్ బదిలీలలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం ఖమ్మం సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి కార్యాలయంలో పని చేస్తుండగా.. పదోన్నతి కల్పించి ఈ బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం వసతి గృహం అధికారిగా నేలకొండపల్లి హాస్టల్ అధికారి బాలకృష్ణ ఇన్‌చార్జ్‌గా పని చేస్తున్నారు. గత నెలలో వసతి గృహంలో సిబ్బంది విద్యార్థులను కొట్టాడని విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, దళిత సంఘాల ప్రతినిధులు ఆందోళన చేయగా.. సంబంధిత జిల్లా అధికారులు ఈ నియామకం చేపట్టారు.

మాజీ వీఆర్వోల సమస్యల పరిష్కారానికి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న అఫ్జల్‌హసన్

ఖమ్మం సహకారనగర్: మాజీ వీఆర్వో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అఫ్జల్‌హసన్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని టీఎన్జీవో ఫంక్షన్ హాల్‌లో మాజీ వీఆర్వో ఉద్యోగుల హక్కుల సాధన కమిటీ సమావేశం నిర్వహించారు. తొలుత మాజీ వీఆర్వోలు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇతర శాఖల్లోకి సర్దుబాటు చేసిన మాజీ వీఆర్వోల పూర్తి సర్వీస్‌ను పరిగణలోకి తీసుకొని సీనియార్టీని లెక్కచేయాలని కోరారు. ఈమేరకు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అఫ్జల్‌హసన్ హామీ ఇచ్చారు. సమావేశంలో టీఎన్జీఓ మాజీ జిల్లా అధ్యక్షుడు కూరపాటి రంగరాజు, నాయకులు నందగిరి శ్రీను, జీ.ఎస్.ప్రసాద్‌రావు, మహిళా విభాగం అధ్యక్షురాలు శాబాసుజ్యోతి, సెక్రటరీ స్వప్న, వైస్ ప్రెసిడెంట్ జ్యోతితో పాటు నీరు కొండ చంద్రశేఖర్, బుద్ధా రామకృష్ణ, నాగుల్‌మీరా, నాగేంద్రబాబు, భాస్కర్ పాల్గొన్నారు.

కష్టాల్లో మునిగారు..


వరద తాకిడికి నేలమట్టమైన ఇల్లు


కేబీఆర్‌నగర్‌లో చెల్లాచెదురైన రేకులు

- నిత్యావసరాలు వరదపాలు..
- కూలిన గోడలు.. వీడని బురద
- కట్టుబట్టలతో మిలిగిన పలువురు

ఖమ్మంరూరల్: ఎడతెరిపిలేని వర్షాలతో మున్నేరుకు వరద ఉధృతి పోటెత్తి ముంపు ప్రాంతాలను అతలాకుతలం చేసింది. ప్రకృతి ప్రకోపానికి బాధితులు నిరాశ్రయులయ్యారు. శనివారం వరద ఉధృతి శాంతించినా.. వారి నివాసాలను మాత్రం బురద వీడలేదు. దీంతో తమ ఇళ్లల్లో చేరిన బురదను ఇంటిల్లిపాది కలిసి శుభ్రం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. మండలంలోని పెదతండా పరిధిలోని జలగంనగర్, నాయుడుపేట, కేబీఆర్‌నగర్, కరుణగిరి, రాజీవ్‌గృహకల్ప కాలనీలను వరద ముంచెత్తింది. ఇళ్లల్లో దాదాపు పది అడుగులకు పైగా వరద నీరు చేరడంతో నిత్యావసరాలు వరదపాలు కావడంతో ఇప్పుడు కొందరు పునరావాస కేంద్రాల్లో.. మరికొందరు తమ ఇళ్లకు చేరుకొని కన్నీటి పర్యంతమవుతున్నారు.

కేబీఆర్‌నగర్‌లో కూలిన ఇళ్లు..

కేబీఆర్‌నగర్‌లో వరద తాకిడికి మూడు ఇళ్లు పూర్తిగా వరదకు కొట్టుకుపోయాయి. వారు ఇప్పుడు కేవలం కట్టుబట్టలతో మాత్రమే పిల్లాపాపలతో మిగిలారు. పాడి గేదెలు, మేకల ద్వారా వచ్చే కొద్దిపాటి ఆదాయంతోనే వారు కుటుంబాలను పోషించుకుంటున్నారు. ధరావత్ జ్యోతి, ప్రసాద్, అనసూర్యలకు చెందిన ఇళ్లు కొట్టుకుపోవడంతో తమ పరిస్థితి ఏంటని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరిగినా తమ ఇళ్లను చూడటానికి ఏ అధికారి రాలేదని వారు వాపోతున్నారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి..



ఉన్న ఒక్క రేకుల ఇళ్లు వరదకు కొట్టుకుపోయింది. కట్టుబట్టలే మిగిలాయి. రెండు పాడి గేదెలతో కుటుంబం నడుస్తోంది. అన్నీ కోల్పోయి రోడ్డున పడ్డాం. వరదలు వచ్చి మూడు రోజులు దాటినా ఇంతవరకు ఏ అధికారి ఇటు వైపు కన్నెత్తి చూడలేదు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలి.

– ధరావత్ జ్యోతి, కేబీఆర్‌నగర్

వరద.. ఆగమాగం

తడిసిన రేషన్ బియ్యం..


తడిసిన బియ్యం బస్తాలు

ఖమ్మంరూరల్: మండలంలోని జలగంనగర్‌లో ప్రభుత్వ చౌక దుకాణంలో ఉన్న 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం వరదకు తడిసిముద్దయ్యాయి. డీలర్ ప్రజలకు పంపిణీ చేయాల్సిన బియ్యాన్ని దుకాణంలో నిల్వ చేయగా ఉన్నట్టుండి వరద రావడంతో అప్పటికే పంపిణీ చేసి నిల్వ ఉన్న బియ్యం వరదకు తడిసిపోయి దుర్వాసన వస్తున్నాయి. దీంతో డీలర్ పైఅధికారులకు సమాచారం ఇచ్చారు.

గురుకులాల్లో తడిసిన పుస్తకాలు..


తడిసిన పుస్తకాలను పరిశీలిస్తున్న నాయకులు

ఖమ్మంరూరల్: గురుకులాల్లో ప్రభుత్వం రక్షణ చర్యలు చేపట్టాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ తెలిపారు. శనివారం మండలంలోని జలగంనగర్‌లోని గురుకుల వరదలకు మునిగిపోగా పాఠశాలలను పీడీఎస్‌యూ నాయకులు సందర్శించారు. గురుకులాలను చెరువులు, ఏటికి దగ్గరలో ఉంచడంతో వచ్చిన వరదలకు విద్యార్థుల పుస్తకాలు, బట్టలు, బ్యాగులు, స్టేషనరీ తడిసిపోయాయని పేర్కొన్నారు. అధికారులు స్పందించి విద్యార్థులకు అవసరమైన మెటీరియల్ అందించి పాఠశాలలో ఉన్న వరదనీటిని తొలగించాలని కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు దీపిక, పార్థసారథి, భాను, శ్రీకాంత్ కిరణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

కూలిన ట్రాన్స్‌ఫార్మర్లు.. విరిగిన స్తంభాలు..


రాజారాంపేటలో నేలమట్టమైన ట్రాన్స్‌ఫార్మర్

నేలకొండపల్లి: భారీ వర్షాలకు విద్యుత్ పంపిణీ సంస్థ అతలాకుతలమైంది. రెండ్రోజుల క్రితం వచ్చిన వరదలకు మండలంలోని రాజేశ్వరపురం, నేలకొండపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని పలు స్తంభాలు విరగడంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లు కూలాయి. రాజేశ్వరపురం సబ్‌స్టేషన్ పరిధిలో పాలేరు ఏటి పరివాహక ప్రాంతంమైన సుర్దేపల్లిలో 12 స్తంభాలు విరిగిపోయాయి. రామచంద్రాపురంలో 25 కే.వీ. ట్రాన్స్‌ఫార్మర్ నేలమట్టమైంది. 8 విద్యుత్ స్తంభాలు విరిగిపోయినట్లు రాజేశ్వరపురం ఏఈ బాలాజీ తెలిపారు. నేలకొండపల్లి పరిధిలోని రాజారాంపేట ఫీడర్‌లో 25 కే.వీ.ట్రాన్స్‌ఫార్మర్ 1, స్తంభాలు 2, విరిగిపోయాయి. పైనంపల్లిలో 25 కే.వీ. ట్రాన్స్‌ఫార్మర్ 1, స్తంభాలు 3 పడిపోగా.. నేలకొండపల్లిలో 3 స్తంభాలు, రాజారాంపేటలో 10 స్తంభాలు విరిగిపోయాయి. మొత్తం 5 ట్రాన్స్‌ఫార్మర్లు, 13 స్తంభాలు విరిగినట్లు నేలకొండపల్లి ఏఈ కె.రామారావు తెలిపారు. ప్రస్తుతం వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో సాధ్యమైన వేగంగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్నారు. కొన్ని ట్రాన్స్‌ఫార్మర్లు వరద నీటిలో ఉన్నాయి.

జోరుగా సేవాకార్యక్రమాలు..

'కావ్య' ఆధ్వర్యాన ఉచిత వైద్యం..


మందులు అందజేస్తున్న డాక్టర్ కావ్య

ఖమ్మంవైద్యవిభాగం: కావ్య ఆస్పత్రి ఆధ్వర్యాన వరద బాధితులకు శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నయాబజార్ పునరావాస కేంద్రంలో ఆస్పత్రి సీఈఓ. డాక్టర్ యలమూడి కావ్యచంద్ బాధితులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్పొరేటర్ గోవిందమ్మ, మాజీ కార్పొరేటర్ తోట రామారావు, ఆస్పత్రి చైర్మన్ యలమూడి రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం..


బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని బొక్కలగడ్డలో మున్నేరు వరద బాధితులకు చాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షుడు సోమ నరేష్, ట్రెజరర్ తల్లాడ రమేష్, మిర్చి శాఖ కార్యదర్శి యడ్లపల్లి సతీష్‌కుమార్, దిగుమతి శాఖ కార్యదర్శి ముత్యం ఉప్పల్‌రావు, మిర్చి వ్యాపారులు బత్తిన నరసింహారావు ఆధ్వర్యంలో 800 మందికి శనివారం బిర్యానీ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ దోరేపల్లి శ్వేత, చాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ మెంతుల శ్రీశైలం, కార్పొరేటర్ మాటేటి నాగేశ్వరరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధిత మెకానిక్‌లకు చేయూత..


ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలో మున్నేరు వరదతో సర్వం కోల్పోయిన మెకానిక్‌ల కుటుంబాలకు టూవీలర్ మెకానిక్‌ల అసోసియేషన్ ఆధ్వర్యాన శనివారం ఆర్థిక సాయం అందించారు. ఖమ్మంకు చెందిన నరేంద్ర, వెంకటనరసయ్య, వీరన్న కుటుంబాలు మున్నేరు వరదతో సర్వం కోల్పోగా, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వంగాల కొండలరావు రూ.5వేల చొప్పున రూ.15వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, అశ్వర్ మురళి, శ్రీను, నాగేశ్వరావు, వెంకట్, బ్రహ్మం, లాలయ్య, జగదీష్, మీరా తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్ష సాయం చేయాలి..

ఖమ్మం మామిళ్లగూడెం: వరద ప్రభావిత ప్రాంతాల్లో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ప్రతినిధి బృందం పర్యటించింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గోకినపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. వరద బాధితులకు తక్షణసాయంగా రూ.లక్ష ఆర్థిక సాయం, ఇల్లు దెబ్బతిన్న వారి ఇంటి నిర్మాణానికి రూ. 5లక్షలు ఇవ్వాలని, కోరారు. మున్నేరుకు ఇరువైపులా కరకట్ట నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆవుల వెంకటేశ్వర్లు, అశోక్, ఝాన్సీ, చందు, సత్తార్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.